క్లుప్తంగా

యూపీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా అధికారి నూకరాజు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బండిమెట్టలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా మలేరియా అధికారి నూకరాజు బుధవారం తనిఖీ చేశారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి ఆరా తీశారు. ప్రతిరోజూ ఏఎన్‌ఎంలు తీస్తున్న రక్త నమూనాలను ల్యాబ్‌కు సకాలంలో పంపించాలన్నారు. యూపీహెచ్‌సీలో ల్యాబ్ తనిఖీ చేసి టెక్నీషియన్‌కు తగిన సూచనలు చేశారు. 3.ఓ సర్వే త్వరగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారికి సూచించారు.

సిజేరియన్లపై ఆడిట్ నిర్వహించి చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): సిజేరియన్ కాన్పులు ఎక్కువగా చేసే ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆడిట్ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ స్పష్టం చేశారు. ఆమె బుధవారం తన చాంబర్‌లో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాలు, ఇతర ఆరోగ్య సేవల వివరాలను ప్రతి నెలా 3వ తేదీన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) పోర్టల్, సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్‌ఎస్) పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసిన మహేష్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): కలెక్టర్ పి.రంజిత్‌బాషాను లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ డి.మహేష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూలు వచ్చిన ఆయన బుధవారం ఉదయం కలెక్టర్‌ను కలిశారు.

మాజీ సైనికుడి మృతి



రాజేందర్ రెడ్డి

కర్నూలు(అర్బన్): నగరంలోని ఏ క్యాంప్ మాంటిస్సోరీ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు రాజేందర్‌రెడ్డి ఈ నెల 18న రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేందర్‌రెడ్డి ఆర్‌వీసీ ఆర్మీలో హవల్దార్‌గా 24 ఏళ్ల సర్వీసు పూర్తి చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని, ఆయన కుటుంబానికి సంఘం అండగా ఉంటుందన్నారు. రాజేంద్రరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మునిసిపల్ కార్యాలయం ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 26వ తేదీన మునిసిపల్ ఆఫీసును ముట్టడించనున్నట్లు సీపీఎం నగర కమిటీ సభ్యుడు ఎస్‌ఎండీ షరీఫ్ తెలిపారు. బుధవారం గౌలుగేరి, పెద్ద పడఖాన, కవాడి వీధి, తెలుగేరి ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. నిత్యావసర వస్తువుల రేట్లను తగ్గించాలని, విద్యుత్ చార్జీలను పెంచకూడదని, ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ చేపట్టే మునిసిపల్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు జయమ్మ, అబ్దుల్‌దేశాయ్ పాల్గొన్నారు.

ప్రైవేటుపై ఉన్న మోజు ప్రభుత్వ వర్సిటీలపై ఏదీ?

కర్నూలు(సెంట్రల్): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రైవేట్ యూనివర్సిటీలపై ఉన్న మోజు ప్రభుత్వ యూనివర్సిటీలపై లేదని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ ఎద్దేవా చేశారు. బుధవారం డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిట్స్ యూనివర్సిటీకి బిల్లు పెట్టగానే 70 ఎకరాల భూమిని కేటాయించడం ప్రైవేట్ యూనివర్సిటీలపై ఉన్న మోజుకు నిదర్శనమన్నారు. అదే బడ్జెట్‌లో ప్రభుత్వ యూనివర్సిటీలకు కేటాయించాల్సిన నిధులను కట్ చేశారని, అధ్యాపక, అధ్యాపకేతర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకుముందు కూడా ఓటరు జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అందులో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ప్రతి నెలా సమావేశం నిర్వహించి సూచనలను తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ అంశాలపై చురుగ్గా ఉండేవారిని పంపాలని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా బీఎల్‌ఓ పోస్టులు ఖాళీగా ఉంటే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక్క బీఎల్‌ఓకు ప్రతి రాజకీయ పార్టీ ఏజెంట్‌ను నియమించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య తక్కువగా ఉందని, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ వద్ద ట్రాన్స్‌జెండర్ల జాబితాలో వివరాలు సరిపోల్చుకోవాలన్నారు. అంతకుముందు కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల గోదామును పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్చి 22న కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం పూడిచెర్లకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. రాబోయే జూన్‌లోపు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు లక్షల ఫారం పాండ్‌లను నిర్మించాల్సి ఉందన్నారు. పూడిచెర్లలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫారం పాండ్‌ల నిర్మాణాలకు భూమి చేస్తారని, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శుక్రవారం సాయంత్రంలోపు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డీఓ సందీప్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్ నోడల్ ఆఫీసర్లుగా ప్రొఫెసర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి విభాగం ప్రొఫెసర్ నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. రెగ్యులర్‌గా రోగుల ఓపీ, ఐపీ, డిశ్చార్జ్ డేటాను ఈ-హాస్పిటల్‌లో అప్‌లోడ్ చేసేందుకు హౌస్‌సర్జన్లు, పీజీలు, నర్సింగ్ సిబ్బంది సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రతిరోజూ ఈ-హాస్పిటల్ అమలు, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్‌ఎస్) సిస్టమ్ పక్కాగా అమలు చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఈ-హాస్పిటల్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డును ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని చెప్పారు. దశలవారీగా ఆయా విభాగాల్లో ఆడిట్ చేస్తామని చెప్పారు. క్యాజువాలిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. రోగులకు ఖరీదైన మందుల ఇండెంట్ పెట్టేటప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): ఆస్పత్రికి సంబంధించిన ఫైళ్లను సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆయన బుధవారం తన చాంబర్‌లో కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి, మెడికల్ కళాశాలల వద్ద అందుబాటులో ఉన్న అన్ని రకాల నిధులు, మందుల సేకరణ, లాజిస్టిక్స్, శస్త్రచికిత్సకు సంబంధించిన పరికరాలు, ఆసుపత్రికి అవసరమైన అన్ని రకాల వస్తువులు, సౌకర్యాల నిర్వహణకు సంబంధించిన అన్ని ఒప్పందాలు, ఏసీలు, లిఫ్టులు, ఎస్‌టీపీ, నీటి సరఫరా, ఐటీ హార్డ్‌వేర్, ఇతరులకు వార్షిక నిర్వహణ ఒప్పందాలు, ఆసుపత్రి నిర్వహణ, కళాశాల సివిల్, ఎలక్ట్రికల్ నిర్వహణకు సంబంధించిన ఫైళ్ల గురించి సమీక్షించారు. సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మల్లేశ్వరమ్మ, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, అకౌంటెంట్లు లతీఫ్‌బేగ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

29 వరకు క్లియరెన్స్ సేల్

కర్నూలు(అగ్రికల్చర్): తెలుగు సంవత్సరాది ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియంలో యాన్యువల్ క్లియరెన్స్ సేల్ కార్యక్రమం ఈ నెల 29 వరకు కొనసాగుతుందని మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి క్లియరెన్స్ సేల్‌కు ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చిందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వస్తువులపై 10 శాతం, ఎంపిక చేసిన వస్తువులపై 50 శాతం వరకు తగ్గింపు సదుపాయం ఉందని పేర్కొన్నారు. హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి హస్తకళా పరిశ్రమల ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మకాలు జరుగుతాయని వెల్లడించారు. కొండపల్లి, ఏటికొప్పాక, వైట్‌మెటల్ బొమ్మలు, బంజార-క్రోచెట్‌లెస్‌లు, స్టోన్‌వేర్ ఫొటోఫ్రేములు, రోజ్‌ఉడ్ బొమ్మలు, బ్లాక్ మెటల్ క్రాఫ్ట్స్ తదితర వస్తువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

5న గరికపాటి ప్రవచనం

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ ప్రత్యేక ప్రవచనం ఏర్పాటు చేసినట్లు శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. నెహ్రూనగర్‌లోని శ్రీ సత్యసాయి కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'శ్రీమద్ రామాయణం' అనే అంశంపై మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరిక పాటి నరసింహారావు ప్రవచనం చెబుతారని పేర్కొన్నారు. సేవా సమితి సభ్యులు, సాయి భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సేవాభావంతో ముందుకు సాగాలి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాలలో బుధవారం 2020-21 బ్యాచ్ నర్సింగ్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చక్కని నడవడిక, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ఫైల్‌ను బహుమతిగా ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాళ్లు వసంతకుమారి, అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దురలవాట్లపై అవగాహన కల్పించాలి

కర్నూలు (హాస్పిటల్): దురలవాట్ల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ శైలేష్ కుమార్ సూచించారు.ఆయన బుధవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పసుపల గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమా న్ని తనిఖీ చేశారు. అసంక్రమిత వ్యాధుల సర్వేను వైద్యాధికారి అబ్దుల్ హసీద్‌తో కలిసి పరిశీలించారు. ఎన్‌సీడీ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. 30 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీహెచ్‌ఓ నమ్రత, వైద్య సిబ్బంది ఉన్నారు.

21న మండల కేంద్రాల్లో భిక్షాటన

కర్నూలు(సెంట్రల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెండింగ్ వేతనాల కోసం మార్చి 21వ తేదీన మండల కేంద్రాల్లో భిక్షాటన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల జిల్లాకు వచ్చిన మంత్రి లోకేష్ వలసలు లేకుండా చేస్తామని గాలి మాటలు మాట్లాడి వెళ్లిపోయారని, కనీసం చేసిన పనులకు సంబంధించి కూలి ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

23న బ్రహ్మోత్సవ సమితి సమావేశం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ శ్రీరామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈ నెల 23న ఉదయం 10 గంటలకు షరాఫ్ బజార్‌లోని శ్రీ వేంకటాచలపతి ఫంక్షన్ హాల్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాల స్వాగత సమితి కోశాధికారి చిలుకూరు నందకిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి హనుమేశాచార్ తెలిపారు. ఈ ఏడాది ఆలయం వంద సంవత్సరాల వేడుకలను నిర్వహించుకోబోతున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 12 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 16న సీతారాముల కల్యాణం, రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

అనారోగ్యంతో టీచర్ మృతి

కర్నూలు సిటీ: స్టాంటన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత టీచర్‌గా పని చేస్తున్న దయానందరాజు అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఈయన మృతి పట్ల పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, బాబురావు, దర్వేష్, దామోదర్, సురేంద్ర, పవిత్రన్, శ్రీకాంత్, మరియానందనం ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పజెప్పాలి



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

కర్నూలు(సెంట్రల్): టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు అప్పజెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కర్నూలులోని టిడ్కో గృహ సముదాయాన్ని పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కర్నూలులో రూ.575 కోట్లతో 10,400 గృహాలను నిర్మించారని, అయితే వాటిని పేదలకు ఇవ్వలేదన్నారు. సీఎం చంద్రబాబు అధికారం చేపట్టి 9 నెలలు గడిచినా ఇళ్లను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. టిడ్కో కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బాధితులతో కలసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు మునెప్ప, జగన్నాథం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అభిప్రాయ సేకరణ

కర్నూలు (టౌన్): నగరంలో రోజువారీ స్వచ్ఛత పనులపై ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఏటా నగరాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య స్థితిగతులను పరిశీలించి ర్యాంకులు ప్రకటిస్తుందని వివరించారు. కర్నూలు నగరం 221 ర్యాంకు నుంచి గతేడాది 32వ ర్యాంకుకు చేరుకుందని తెలిపారు. ఈ ఏడాది సింగిల్ డిజిట్ ర్యాంకు సాధించాలనే సంకల్పానికి నగరంలోని ప్రతి పౌరుడు సహకరించాలని కోరారు. ఇందుకోసం స్వచ్ఛ సర్వేక్షణ్ వెబ్‌సైట్ httpr://sbmurban.org/feedback ను ఓపెన్ చేసి స్వచ్ఛతకు సంబంధించిన పది ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. కర్నూలు నగరాన్ని జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రతి పౌరుడు ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని కోరారు.

మాతృభాషను కాపాడాలి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్‌లో తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికంగా మార్చేందుకు చేస్తున్న చర్యలు నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగు అధ్యాపకులు బుధవారం ఇంటర్ స్పాట్ క్యాంపు ఆఫీసర్ గురువయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. ఇంటర్‌లో తెలుగు సబ్జెక్టు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికం చేయడమంటే తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన మారెప్ప

పెద్దకడబూరు: హనుమాపురం బస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శాంసోన్ అలియాస్ రంగన్న, ముక్కీరమ్మ కుమారుడు మారెప్ప(22) బనవాసి నుంచి బైక్‌పై ఎమ్మిగనూరు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ఎమ్మిగనూరు నుంచి ఆదోని వైపు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో మారెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైక్‌కు నిప్పు అంటుకొని మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు నీళ్ల పోసి అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇక ప్రకృతి వ్యవసాయంపై పర్యవేక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయాన్ని పర్యవేక్షించడం, సమీక్షలు నిర్వహించే అధికారాన్ని ప్రభుత్వం వ్యవసాయ యంత్రాంగానికి ఇచ్చింది. ఇప్పటివరకు ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లేదు. జిల్లా వ్యవసాయ అధికారి మాత్రం అడపాదడపా పర్యవేక్షిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం మొత్తం ప్రాజెక్టు మేనేజర్ ఆధ్వర్యంలోనే జరుగుతోంది. ఇకపై ఏఓలు మొదలుకొని ఏడీఏలు, జిల్లా వ్యవసాయ అధికారి వరకు ప్రకృతి వ్యవసాయాన్ని పర్యవేక్షిస్తారు. సమావేశాలు కూడా నిర్వహించి పురోగతిని సమీక్షించే అధికారాలను ఇస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

లంబాడీలను అణగదొక్కేందుకు కుట్ర



మాట్లాడుతున్న ఆర్.కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గిరిజన, లంబాడీలను అణగదొక్కేందుకు కుట్రలు పన్నుతోందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్‌నాయక్ ఆరోపించారు. బుధవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటినా గిరిజన, లంబాడీల జీవితాలు మాత్రం అలాగే ఉన్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత, వ్యవసాయం లేక గిరిజన రైతులు అనేక ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీస్తున్నారన్నారు. దుర్భరమైన జీవనం గడుపుతున్న గిరిజన లంబాడీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ పరంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అభివృద్ధిని గాలికి వదిలేసి ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తూ రాష్ట్రంలో కులాల మధ్య కుంపటి పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజునాయక్, విద్యార్థి సంఘం నాయకులు రామాంజినాయక్ పాల్గొన్నారు.

తైక్వాండోలో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన సుగంధిని

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన సుగంధిని బంగారు పతకం సాధించింది. ఈ నెల 16వ తేదీన గుంటూరు జిల్లా తెనాలిలోని ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఆస్మిత్ ఖేలో ఇండియా మహిళల లీగ్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. జూనియర్ అండర్- 49 కేజీల విభాగంలో పాల్గొన్న ఈమె ప్రతిభ చాటి పతకం సాధించింది. రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన ఈమె వచ్చే జూన్‌లో నిర్వహించనున్న సౌత్‌జోన్ స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించిందని తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ బుధవారం వెల్లడించారు.

వైభవంగా వసంతోత్సవం



హంస వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

మద్దికెర: పెరవలి శ్రీరంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, పల్లకీ సేవ, వసంతోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిలను పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా వెళ్లి స్థానిక స్వామి వారి బావి వద్ద వసంతోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. రాత్రి శ్రీవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై కొలువుంచి పురవీధుల్లో ఊరేగించారు.

మాలల అణచివేతకు చంద్రబాబు కుట్ర



పోస్టర్లను విడుదల చేస్తున్న మాల జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో మాలల్ని అణచివేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు మండిపడ్డారు. బుధవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట 'హలో మాల - ఛలో తిరుపతి' పోస్టర్లను మాల సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ఆర్టికల్ – 341 వర్గీకరణ చేసేందుకు కుదరదని చెబుతున్నా, చంద్రబాబు మాత్రం తన పంతం నెగ్గించుకునేందుకు చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మాలల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తిరుపతిలో జరగనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా మాలలు తరలిరావాలని కోరారు. జేఏసీ గౌరవాధ్యక్షులు మాధవస్వామి, కో- కన్వీనర్ నర్సప్ప, మద్దిలేటి, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలి



దేవదాయశాఖ కార్యాలయ భవనాల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ కార్యాలయాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని నాణ్యత ప్రమాణాలు పాటించాలని దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. బుధవారం నగర శివారులో నిర్మిస్తున్న డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్, జేపీఈఓ, ఇంజినీరింగ్ విభాగం కార్యాలయాల నిర్మాణాలను ఆజాద్ పరిశీలించారు. శ్రీరామనవమి పర్వదినం తరువాత కార్యాలయాల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌జేసీతో పాటు డీసీ గురుప్రసాద్, ఆర్‌ఎస్ రంగాపురం మద్దిలేటి స్వామి ఆలయం ఈఓ రామాంజనేయులు, డీఈ శ్రీనివాస ప్రసాద్, ఏసీ సుధాకర్ రెడ్డి, ఏఈలు రంగ ప్రసాద్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వేను వేగవంతం చేయాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఐఓ నాగప్రసాద్ బాబు

కర్నూలు (హాస్పిటల్): ఎన్‌సీడీ 3.0 సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు ఆదేశించారు. ఆయన బుధవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో సర్వేను తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సు, ఏఎన్‌ఎం, ఆశాలు కలిపిన బృందం సర్వే పక్కాగా చేపట్టి వివరాలను ఎన్‌సీడీ 3.0 యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ముఖ్యంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షల కోసం స్క్రీనింగ్ చేయాలన్నారు. అనుమానిత కేసులను ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లకు రెఫర్ చేస్తే అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి దేవి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ మానుకుంటేనే నవోదయం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రెహానా బేగం

కర్నూలు: సారా తయారీ మానుకుంటేనే జీవితంలో నవోదయం వస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ రెహానా బేగం అన్నారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓర్వకల్లులో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం నాటుసారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నాటు సారా తయారీ, అమ్మకం, తాగడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సారా తయారీ, విక్రయాలు, రవాణా చేయడం నేరమని హెచ్చరించారు. సారా తయారీ మానుకునేవారికి జీవనాధారం కల్పిస్తామని చెప్పారు. సారా నిర్మూలనపై గ్రామస్తులచే రెవెన్యూ అధికారుల సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు.

పాత నేరస్తులు బైండోవర్...

జీవనాధారం కోసం నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తూ పట్టుబడిన పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. చర్యలు ఉల్లంఘించినట్లయితే వీరికి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఎన్‌ఎస్ గంగారాం, ఎన్‌ఎస్ విజయ్, మీదివేముల గ్రామానికి చెందిన మద్దయ్య, ఓర్వకల్లుకు చెందిన నీలిశికారి సుశీల, ఎన్‌ఎస్ గాయత్రి, ఎన్‌ఎస్ శైలు, ఎన్‌ఎస్ రాజమ్మ, సంతోష్‌నగర్‌కు చెందిన ఎరుకలి విజయ్ తదితరులను బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రెహానా బేగం తెలిపారు. సిబ్బంది శేషారెడ్డి, ఈరన్న, రామచంద్రుడు, మధు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న ఆర్‌డీఓ సందీప్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ హెచ్చరించారు. ఆయన బుధవారం పీసీ అండ్ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేసి పత్రాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేవో పరిశీలించి జిల్లా స్థాయి కమిటీకి నివేదికలు సమర్పించాలన్నారు. కమిటీ ఆమోదించిన తర్వాత వారికి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో ఫారం – ఎఫ్ రిపోర్టులను క్రమం తప్పక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాలని, అన్ని స్కానింగ్ కేంద్రాల్లో పోస్టర్లు ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటి తీర్మానం చేసింది. పీసీ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్‌బాబు, డెమో శ్రీనివాసులు శెట్టి, సీడీపీఓ అనురాధ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు సమీపంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పెట్రోలు పోసి నిప్పు పెట్టిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ డిమాండ్ చేశారు. పేదల పెన్నిధి వైఎస్ఆర్ విగ్రహాలను ధ్వంసం చేయడం, నిప్పు పెట్టడం అన్యాయమన్నారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.